క్లుప్తంగా

అన్నదానమే మహాదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ

జగదాంబ: అన్నదానం మహా దానమని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. గురువారం శ్రీరామ నవమి సందర్భంగా జీవీఎంసీ 35వ వార్డు రామకృష్ణనగర్ వద్ద అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అన్ని దానాల కంటే అన్నదానమే గొప్పదన్నారు. పేదల కడుపు నింపడానికి ప్రతి ఒక్కరూ అన్నదానం చేయాలన్నారు. యువకులు సేవా భావం అలవరుచుకోవాలని తెలిపారు. అనంతరం అయిదు వందల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నందవరపు శివ, మంగరాజు, మల్లబుజ్జి, గండిబోయిన రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కళాకారులకు పురస్కారాలు



పురస్కారాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాడి సత్యనారాయణ, నిర్వాహకులు

డాబాగార్డెన్స్: విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న ఉగాది విశిష్ట కళా పురస్కారాలు అందజేయనున్నట్టు సంఘం అధ్యక్షుడు కె. జనార్దన్ తెలిపారు. ఈ మేరకు గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్ ఆవిష్కరించి, కార్యక్రమ వివరాలు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా పలువురు ప్రముఖుల చేతుల మీదుగా సినిమా, నాటక, పౌరాణిక, తబలా, మ్యూజిక్, సింగింగ్, మిమిక్రీ, వెస్టన్ డ్యాన్స్, జానపద విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలతో సత్కరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, దర్శకుడు యాద్‌కుమార్, ఆర్. నాగరాజు పటాన్నాయక్, శివజ్యోతి, కన్నం వెంకటరమణ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

డాబాగార్డెన్స్: పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్న పలువురు విద్యార్థులకు శిష్టకరణం యువత ఫౌండేషన్ పేరిట పరీక్ష సామగ్రిని గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో పంపిణీ చేశారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు చేతుల మీదుగా ఆ కిట్ అందజేశారు. నిరుపేద విద్యార్థులకు సేవా సంస్థలు అండగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రముఖ కవి డాక్టర్ డబ్బీర్ శ్రీకాంత్ విద్యార్థులకు పరీక్ష రాయడంలో మెలకువలు వివరిస్తూ టెన్షన్ లేకుండా ఏ విధంగా పరీక్షలు రాయాలో వివరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం. సురేష్‌కుమార్, ఎంఎస్‌ఆర్ ప్రసాద్, కోరాడ ప్రశాంతి, మానాపురం మణిశంకర్, ఎం. మహేశ్వరి, కె. పావని, ఎస్. హరి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ముడసర్లోవలో జీ-20 ప్రతినిధుల సందడి

ఆరిలోవ: జీ-20 ప్రతినిధులు ముడసర్లోవ ప్రాంతంలో గురువారం సందడి చేశారు. నగరంలో మూడు రోజులుగా జీ-20 దేశాల సదస్సు జరుగుతున్న విషయం తెలసిందే. ఇందులో భాగంగా మధ్యాహ్నం 3.30 గంటలకు ఆ దేశాల ప్రతినిధులు ముడసర్లోవ రిజర్వాయరులో జీవీఎంసీ నిర్వహిస్తున్న ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను సందర్శించారు. రిజర్వాయరులో ఏర్పాటు చేసిన సోలార్ పలకలను ఆసక్తిగా తిలకించారు. ప్లాంట్ నుంచి ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.. దాన్ని ఏవిధంగా వినియోగిస్తున్నారు.. తదితర వాటి గురించి అధికారులు ప్రతినిధులకు వివరించారు. రక్షణ చర్యల్లో భాగంగా అధికారులు రిజర్వాయరు ఒడ్డున రెండు బోట్లు, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

తనువెల్లా కనులై..

- తరించిన భక్తులు
- కమనీయంగా సీతారాముల కల్యాణం
- మంగళ వాయిద్యాలతో మార్మోగిన నగర వీధులు



అంబికాబాగ్ సీతారాములను దర్శించుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి దంపతులు



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి దంపతులు, ఈవో రమేష్‌నాయుడు తదితరులు

సీతారాములు పెళ్లి పీటలెక్కారు. జగదభి రాముడు శ్రీరాముడు, ధరిత్రీ తనయ సీతమ్మ వారి పెళ్లికి ఊరు ఊరంతా చలువ పందిళ్లు వేసి.. తోరణాలు కట్టారు. పెద్దలు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో తరలి వచ్చారు. చిన్నాపెద్దా.. ముసలీ ముతకా అంతా స్వామి, అమ్మవార్ల పరిణయ మహోత్సవాన్ని తనువెల్లా కనులై వీక్షించి తరించిపోయారు.

అల్లిపురం: చలువ పందిళ్లు.. మామిడాకుల తోరణాలు.. మంగళ వాయిద్యాలు.. వేద మంత్రాలతో నగరంలో ప్రతి వీధి, ప్రతి వాడ, గుడి, రోడ్డు గురువారం రామనామ జపంతో నిండిపోయింది. ముత్యాల ముగ్గులు, రంగు రంగుల పూలతో అలంకరించిన పెళ్లి మండపంలో సిరికల్యాణపు బొట్టు పెట్టి, మణిభాసికము ధరించి, బుగ్గన చుక్క, పాదాలకు పారాణితో వరుడిగా రామయ్య, సొంపుగా కస్తూరి నామంతో, కనకాంబరాలు, మల్లెలతో ఇంపైన పూలజడ, బుగ్గన చుక్కతో పెళ్లి కుమార్తెగా సీతమ్మ పెళ్లి మండపంలో కొలువుదీరి భక్తజనులకు కనువిందు చేశారు.

బంగారుమెట్టలో..

శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. బంగారుమెట్ట, వెంకటేశ్వరమెట్ట, అస్సాంగార్డెన్స్ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని సమాజం అధ్యక్షుడు భీశెట్టి హనుమంతరావు తెలిపారు.

కోదండరామస్వామి దేవస్థానంలో..

శ్రీ సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం అల్లిపురం మెయిన్‌రోడ్డు, మార్కెట్‌రోడ్డు, కర్ణాలవీధి, సౌత్‌జైలు రోడ్డు మీదుగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కుమ్మరివీధిలో..

సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా చేపట్టారు. కుమ్మరివీధి, అమ్మవారివీధి, మెయిన్‌రోడ్డు, మార్కెట్ రోడ్డు నుంచి భక్తులు తరలి వచ్చారు.

రైల్వే క్వార్టర్స్ రామాలయంలో..

సీతారాముల కల్యాణం వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి దేవాలయంలో..

శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే అచ్చియ్యమ్మపేట అభయాంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. గోవింద్‌రోడ్డులోని రాం రాం మందిరంలో సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. దొండపర్తిలోని శ్రీరామ పంచాయతన దేవాలయంలో రాములోరి పెళ్లి అట్టహాసంగా జరిగింది.

ఘనంగా సీతారాముల గ్రామోత్సవం

కుమ్మరివీధి రామాలయం ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవ విగ్రహాల పల్లకి ఊరేగింపులో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కుమ్మరివీధి, నీలమ్మవేపచెట్టు, బంగారుమెట్ట, అల్లిపురం మెయిన్‌రోడ్డు మీదుగా తిరిగి దేవాలయానికి తిరువీధి చేరుకుంది.

భక్తిశ్రద్ధలతో రామనామ జపం

శ్రీరామనవమి సందర్భంగా గోవింద్‌రోడ్డులో గల రాంరాం మందిరంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న నిరంతర రామనామ జపంలో భాగంగా గురువారం చివరి రోజు అన్నమయ్య, రామదాసు కీర్తనలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలపించారు. రామనాప జపం చేస్తున్న భక్త బృందాన్ని ఆలయ నిర్వాహకులు సుధా హనుమంతరావు, రామయ్యమ్మ ఘనంగా సత్కరించారు.

సీతారాముల సన్నిధిలో వైఎస్సార్‌సీపీ నేతలు

శ్రీరామ నవమిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, భీశెట్టి రాజు బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. అనంతరం కల్యాణ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి సమాజం అధ్యక్షుడు భీశెట్టి హనుమంతరావు, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

సీతమ్మవారికి సారె సమర్పణ

రామయ్య, సీతమ్మ పెళ్లి అంటేనే ప్రతి ఒక్కరు తమ ఇంట్లో పెళ్లిగా భావిస్తారు. రామయ్య తరఫున కొంత మంది, సీతమ్మ తరఫున కొంత మంది వ్యవహరిస్తుంటారు. సీతమ్మను అత్తవారింటికి పంపేందుకు వెంకటేశ్వమెట్ట, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం, గౌరీ సేవా సంఘం సభ్యులు గురువారం పసుపు, కుంకుమ, పట్టుచీర, జాకెట్టు, పూలు, పండ్లు, స్వీట్లు, కొబ్బరి బొండాలు తదితర సారె సామాన్లతో, మంగళవాయిద్యాలతో వెంకటేశ్వరమెట్ట, సింహాలదేవిడి, గోవింద్‌రోడ్డు, నీలమ్మవేపచెట్టు మీదుగా బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం వరకు తిరువీధిగా వెళ్లి సారె అందజేశారు. వారికి శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం సభ్యులు స్వాగతం పలికి ప్రత్యేకంగా సత్కరించి, విందు భోజనం ఏర్పాటు చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకట గౌరీ శంకర గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి నరసింహమూర్తి, కార్యదర్శి శరగడం మోహనరావు, కమిటీ సభ్యులు కోరిబిల్లి త్రినాథ్, శరగడం భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేటి ప్రసాద్, టీడీపీ నాయకుడు విల్లూరి చక్రవర్తి, కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో గౌరీ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

విరివిగా పానకాల పంపిణీ

శ్రీరామ నవమిని పురస్కరించుకుని భక్తులకు పానకాన్ని పంపిణీ చేశారు. కల్యాణోత్సవంతో సంబంధం లేకుండా బెల్లం, మిరియాలు, సొంటి, యాలకులతో తయారు చేసిన పానకాన్ని ఔత్సాహికులు తయారు చేసి అందజేశారు. అల్లిపురం మెయిన్‌రోడ్డు, కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం వద్ద పీల వెంకట అప్పలనాయుడు తదితరులు భక్తులకు స్వామి వారి పానకాన్ని అందజేశారు.

35వ వార్డు రామాలయాల్లో..

జగదాంబ: సీతారాముల కల్యాణం గురువారం జీవీఎంసీ 35వ వార్డు వెలంపేట, చిలకపేట, సీహార్స్ జంక్షన్ ప్రాంతాల్లోని రామాలయాల్లో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పాల్గొని కల్యాణం తిలకించారు. అనంతరం ప్రసాదాలు, పానకం పంపిణీ చేశారు. భక్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బ్యారెక్స్‌లో..

దొండపర్తి : శ్రీరామ నవమి సందర్భంగా గురువారం పోలీస్ బ్యారెక్స్ రామాలయంలో డీసీపీ (క్రైం) జి.నాగన్న దంపతులు సీతారాముల కల్యాణం నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతిలో పట్టువస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, రామాలయ కమిటీ సభ్యులు, పోలీస్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి దేవాలయంలో..

మహారాణిపేట: మెయిన్‌రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని గురువారం శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. రూ. 216 చెల్లించిన దంపతులను కల్యాణంలో కూర్చోబెట్టారు. వారి గోత్రనామాలతో కళ్యాణం జరిపించి లడ్డు, పులిహోర ప్రసాదం, తలంబ్రాలు అందజేసినట్లు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు.

దిబ్బలపాలెంలో..

డాబాగార్డెన్స్: నగరంలోని 29వ వార్డు దిబ్బలపాలెంలో సీతారాముల కల్యాణం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్, వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు పాల్గొని స్వామి ఆశీస్సులు పొందారు. ప్రముఖ సంఘ సేవకుడు చందక అప్పలరాజు దంపతులతో పాటు పలువురు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. సాయంత్రం పురవీధుల మీదుగా స్వామిని ఊరేగించారు. కార్యక్రమంలో శ్రీసీతారామ సేవా కమిటీ సభ్యులు మొల్లి రమణ, పసగాడ రామలింగేశ్వరరావు, పి.శ్రీనివాస్, సోర్నపూడి సంజీవరావు, చందక ప్రభాకర్‌రావు, చిటికిరెడ్డి పవన్‌కుమార్, దిబ్బలపాలెం యూత్ సభ్యులు, అర్చకుడు శివశంకర్, భక్తులు పాల్గొన్నారు.

పెయిందొరపేటలో..

పెయిందొరపేట దూరం వారి వీధిలో గల రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ వ్యవస్థాపకుడు చింతపల్లి శంకర్‌రావు, చింతపల్లి పోతురాజు, నూకరాజు, నొల్లు పోతురాజు, రవీంద్ర భరత్, వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో..

సూర్య ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో జైసంతోషిమాత ఆలయంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సన్‌గ్రీన్ సంస్థ వ్యవస్థాపకురాలు శృతి పూజలో పాల్గొని స్వామి ఆశీర్వాదం పొందారు. ఆలయ ధర్మకర్త బాపిరాజు, ప్రధాన అర్చకుడు విశ్వేశ్వరశర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కోటవీధి, ఫిషింగ్ హార్బర్ రోడ్డు, లక్ష్మీటాకీస్ ప్రాంతాల్లో గల రామాలయాల్లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు, 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించారు. నియోజకవర్గంలో గల రామాలయాల్లో స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిపారు. ప్రకాశరావుపేట రామాలయంలో రామ భక్తులు పెద్ద ఎత్తున జైశ్రీ రామ్ అంటూ జెండాలు చేతపట్టి నగరంలో తిరిగారు. రామజోగిపేట శ్రీరామలింగేశ్వరాలయం, పోలీస్ బ్యారెక్స్ ఉమా రామలింగేశ్వరాలయం, ప్రభుత్వ ఘోషాసుపత్రి వద్ద సీతారామచంద్రస్వామి ఆలయం, చెంగల్రావుపేట రామాలయం, రెల్లివీధి రామాలయం, కోటవీధి రామాలయం, గొల్లలపాలెం ఉమా రామలింగేశ్వరాలయం, పాత నగరంలో గల పలు రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



కుమ్మరివీధి రామాలయం ఆధ్వర్యంలో జరిగిన గ్రామోత్సవంలో పాల్గొన్న యువతీ, యువకులు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



కల్యాణంలో పాల్గొన్న డీసీపీ (క్రైం) నాగన్న దంపతులు



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి, విల్లూరి



రామనాప జపంలో పాల్గొన్న భక్త బృందం



సీతమ్మవారికి సారె తీసుకువెళ్తున్న మహిళలు



సీతారాములను దర్శించుకుంటున్న మన్యాల శ్రీను తదితరులు



రామదండుతో వైఎస్సార్ సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్



మెయిన్‌రోడ్డు శ్రీ కోదండరామస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామోత్సవంలో భక్తులు



మెయిన్‌రోడ్డు రాంరాం మందిరంలో సీతారాముల కల్యాణోత్సవం



పూజలందుకున్న ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలోని సీతారాములు



అల్లిపురం మెయిన్‌రోడ్డులో పానకం పంపిణీ చేస్తున్న భక్తులు



సీతారాములకు పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్



లక్ష్మీటాకీస్ ఆంజనేయస్వామి ఆలయంలో పట్టువస్త్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

సిరులతల్లికి సహస్ర తులసిపూజ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవలో 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ.. కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

జ్వరంతో చేర్పిస్తే రూ.2లక్షల బిల్లు వేశారు

కేర్ ఆస్పత్రిపై బాధితురాలి బంధువుల ఆరోపణ

మహారాణిపేట: టైఫాయిడ్‌తో తన కుమార్తె (వైద్య విద్యార్థిని)ను విశాఖ కేర్ ఆస్పత్రిలో చేర్పిస్తే రూ.2లక్షల బిల్లు వేసి వేధిస్తున్నారని ఆమె తండ్రి జయరామ్ ఆరోపించారు. దీనిపై గురువారం ఆమె బంధువులు ఆందోళన చేపట్టి.. ఆస్పత్రి వర్గాలతో వాగ్వాదానికి దిగారు. ఆమె తండ్రి తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం రిమ్స్‌లో రేడియాలజీ విభాగంలో టి.స్పందన పీజీ చేస్తున్నారు. ఆమెకు జ్వరం రావడంతో ఈ నెల 26న రామ్‌నగర్‌లోని కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. నాలుగు రోజుల తర్వాత రూ.2లక్షల బిల్లు వేసి, చెల్లించమని ఒత్తిడి చేస్తున్నారు. జ్వరం ఏమాత్రం తగ్గలేదని అతను ఆరోపించారు. 'వైద్యం చేసిన తర్వాత కొద్ది రోజులకు నయం అవుతుంది. ఆస్పత్రిలో వైద్యం చేసుకోవడం ఇష్టం లేకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు' అని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

'చేయూత'తో మహిళలకు ఆర్థిక భరోసా

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల
- 18వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహణ

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళల బంగారు భవిష్యత్ సాధ్యమైందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. 18వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అంజయ్యనగర్‌లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి ధనలక్ష్మితో కలిసి అక్కరమాని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని వివరించారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ మహిళల కష్టాలను తీర్చేందుకు, వారిని అభివృద్ధి ముంగిట నిలిపేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. డ్వాక్రా రుణాలు ద్వారా మహిళల స్వయం సంవృద్ధికి తోడ్పడుతున్నట్టు చెప్పారు. వైఎస్సార్ చేయూత, అమ్మఒడి పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ సంక్షేమాన్ని వివరిస్తున్న అక్కరమాని తదితరులు

రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో అన్నదానం

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలరావు, వాసుపల్లి నారాయణలతో పాటు కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 23 సంవత్సరాలుగా అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. ప్రతి వారం ఒక దాత సహకారంతో ఈ అన్నదానం చేపడుతున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ వారం ప్రముఖ వ్యాపారవేత్త నాగమరి శివ, దేవి దంపతులు సహకారం అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, వైస్ ప్రెసిడెంట్ పంపాన గణేష్, జాయింట్ సెక్రటరీ బడే నాగరాజు, సహ కోశాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కొండా రాజీవ్‌గాంధీ తదితరులు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేసి, 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు చిన్నా తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీవరాహ నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మంపడంలో ఆశీనులను చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచన, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.